## క్లుప్తంగా

### జీవో 111ను తక్షణమే పునరుద్ధరించాలి

**కవాడిగూడ:** జీఓ 111ను తక్షణమే పునరుద్ధరించాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ జీవో రద్దు చేయడం వల్ల మొత్తం ప్రభుత్వానికి ఆరు లక్షల కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు. ఆదివారం దోమలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జీవో 111 రద్దు ఫలితంగా హైదరాబాద్ జంట నగరాలకు తీవ్ర వరద ప్రమాదం ముంచుకు వస్తుందని పూర్తిగా పర్యావరణం దెబ్బతింటుందని పేర్కొన్నారు. తక్షణమే నగరానికి నష్టం కలిగించే జీవో 111ను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు.

### రేపు ఉచితంగా మొక్కలు, పక్షిగూళ్ల పంపిణీ

**కాచిగూడ:** ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5వ తేదీన సోమవారం కాప్రా, ఈశ్వరిపురి లేన్‌లో ఉచితంగా పండ్లు, ఔషధ మొక్కలు, పక్షిగూళ్లు, పక్షులకు నీళ్ల కుండీలు అందజేయనున్నట్లు పర్యావరణ వేత్త నంబూరి కృష్ణంరాజు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొక్కలు, పక్షి గూళ్ల పంపిణీ ఉంటుందన్నారు. వివరాలకు 9989183004 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

### గ్రూప్-1 ప్రిలిమ్స్ మోడల్ ప్రశ్నపత్రాల ఉచిత పంపిణీ

**చిక్కడపల్లి:** జూన్ 11న నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు మాదిరి ప్రశ్న పత్రాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు కేపీ సర్ యూపీఎస్‌సీ యూనివర్స్ చైర్మన్ కృష్ణప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీన ఉదయం 10 గంటలకు అశోక్‌నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఉన్న తమ అకాడమీలో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వివరాలకు 93929 57733 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

### నేడు న్యూ రామాలయంలో చండీ హోమం, పూర్ణాహుతి

**నల్లకుంట:** న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం(నేడు) సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి కె. జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు సరస్వతి అమ్మవారికి అభిషేకము ఉంటుందన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గల యాగశాలలో చండీ హోమము, పూర్ణాహుతి ఉంటుందని చెప్పారు.

### నేడు ఓయూలో మార్నింగ్ వాక్

**ఉస్మానియా యూనివర్సిటీ:** ప్రపంచ పర్యావరణం దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు (5న) ఓయూలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎన్‌సీసీ గేటు వరకు జరిగే వాకింగ్‌లో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని అధికారులు పేర్కొన్నారు. అనంతరం ఇంజినీరింగ్ కాలేజీ వద్ద సమావేశం ఉంటుందన్నారు.

### నిర్మాణ రంగ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

**లాలాపేట:** నిర్మాణ రంగ కార్మికులకు సీఎస్‌సీ హెల్త్ కేర్ ద్వారా సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేసేందుకు తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి కృషి చేస్తుందని అధికారులు తెలిపారు. ఆదివారం లాలాపేట లేబర్ అడ్డా వద్ద హెల్త్ క్యాంప్ నిర్వహించి సుమారు 100 మంది కార్మికులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, రహమతుల్లా, నరసింహ, శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

**లిబర్టీ:** ఒడిశాలోని బాలాసోర్ రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవి రాజీనామా చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమార స్వామి డిమాండ్ చేశారు. అధికారుల తప్పిదం వల్లే రైలు ప్రమాదం జరిగిందని... ఈ ఘటనలో దాదాపు 300 మంది మృతి చెందడం 1000 మందికి పైగా గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బాలాసోర్లో షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ యశ్వంత్ పూర్ హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొన్న ఘనటలో అమాయక పేద ప్రయాణికులు మృతి చెందారన్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రతా వ్యవస్థ లోప భూయిష్టంగా ఉండటమే ప్రమాదానికి కారణమని అన్నారు. పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్‌ను యశ్వంతపూర్ హౌరా ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు రైల్వే శాఖ తీసుకోవాలనిన్నారు.

# తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సురక్ష దినోత్సవాన్ని పారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు, అధికారులు

**అంబర్‌పేట:** తెలంగాణ పోలీస్ యంత్రాంగం శాంతిభద్రత నిర్వహణలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సురక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్లు విజయ్‌కుమార్ గౌడ్, పద్మ వెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని సీఎం కేసీఆర్ భావించి ఆ శాఖ పటిష్టానికి ప్రత్యేక చేయుతనిచ్చారన్నారు. పోలీస్ శాఖను పటిష్టం చేసి ప్రజా భద్రత కోసం సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో కమాండ్ కంట్రోల్ టవర్స్ నిర్మాణం, మహిళల భద్రతకు షీ టీమ్ ఏర్పాటు వంటి సంస్కరణలు, అభివృద్ధి చర్యలను తీసుకుంటున్నారన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని దానిని పోలీస్ యంత్రాంగం సమర్థవంతంగా నిర్వహిస్తుందని ఎమ్మెల్యే అభినందించారు. ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, కాచిగూడ ఏసీపీ ఆకుల శ్రీనివాస్, డీఎంసీ వేణుగోపాల్, తహశీల్దార్ లలిత, ఇన్‌స్పెక్టర్ అశోక్, సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కరాటేతో ఆత్మవిశ్వాసం

**కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి**



అక్కా చెల్లెళ్లను అభినందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**కాచిగూడ:** పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలంటే కరాటేను ప్రోత్సహించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అక్కాచెల్లెళ్లు ఇద్దరు 6.14 నిమిషాల్లో 9 విభాగాల్లో 81 సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ ప్రదర్శించి వరల్డ్ రికార్డును సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం బర్కత్‌పురలోని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నివాసంలో అక్కాచెల్లెళ్లు ఇద్దరు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు. వరల్డ్ రికార్డ్స్ సాధించి అక్కా చెల్లెళ్లు అమృతా రెడ్డి, ఘన సంతోషిణి రెడ్డిలను కేంద్రమంత్రి అభినందించి సత్కరించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కన్నె రమేష్ యాదవ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, కరాటే మాస్టర్ జి.ఎస్.గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## సేవ్ హుస్సేన్‌సాగర్..

**ట్యాంక్‌బండ్‌పై మానవహారం**



ట్యాంక్‌బండ్‌పై హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో మానవహారం

**కవాడిగూడ:** హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సేవ్ హుస్సేన్‌సాగర్, సేవ్ హైదరాబాద్ నినాదంతో ట్యాంక్‌బండ్‌పై మానవహారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్యావరణ వేత్త ప్రొఫెసర్ దొంతి నర్సిరెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ హుస్సేన్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ లాంటి చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు హుస్సేన్‌సాగర్ కాలుష్యంతో ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పర్యావరణవేత్త సాగర్ మాట్లాడుతూ హుస్సేన్‌సాగర్‌ను కాలుష్య రహిత చెరువుగా మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ప్లాస్టిక్ కాలుష్యంపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు పాశ్యం యాదగిరి మాట్లాడుతూ హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం సదస్సులు, సెమినార్‌లు నిర్వహిస్తామని విద్యార్థుల స్థాయి నుంచి చైతన్యాన్ని పెంచేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ప్రముఖ మెజిషియన్ చొక్కపు వెంకటరమణ, సామాజికవేత్త రాజీవ్ పాల్గొన్నారు.

## మాలల భవనం కోసం భూమిని కేటాయించాలి



మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న మాలల జేఏసీ నేతలు

**కాచిగూడ:** మాలల భవన నిర్మాణానికి భూమిని కేటాయించి నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాలల జేఏసీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాలల జేఏసీ వర్కింగ్ చైర్మన్ గోపోజు రమేష్ బాబు మాట్లాడుతూ అర్హులైన మాలలందరికీ దళితబంధు పథకాన్ని ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజుతో సమావేశమైన బీఆర్ఎస్ నేతలు

**కాచిగూడ:** శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు అన్నారు. ఆదివారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు ఎక్కాల కన్నా ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజును పార్టీ నేతలు, సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మున్నాసింగ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

## బ్యాంకుల ప్రైవేటీకరణ వద్దు



సదస్సులో మాట్లాడుతున్న దెబాసిస్ బాసు చౌదరి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** దేశంలో ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనలను ప్రభుత్వం విమరించుకోవాలని బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి దెబాసిస్ బాసుచౌదరి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2వ మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దెబాసిస్ బాసుచౌదరి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. దేశం మొత్తం మీద బ్యాంకుల్లో ఖాళీలుగా ఉన్న 20 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, కాంట్రాక్టు, టెంపరరీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐఆర్ఆర్‌బీఈఏ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, బిఎఫ్ఐ తెలంగాణ సెక్రటరీ పి.వెంకటరామయ్య పాల్గొన్నారు.

## కటకం సుదర్శన్‌కు నివాళి

**ముషీరాబాద్:** సీపీఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యులు కటకం సుదర్శన్(ఆనంద్) మరణం పట్ల సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మిక కుటుంబం నుంచి కార్మిక నాయకుడిగా ఎదిగి, భారత విప్లవోద్యమానికి అంకితమై చివరి శ్వాస వరకు పని చేశారన్నారు. ఆదివాసులు, పీడితులు, కార్మికులు, రైతుల కోసం ఎన్నో పోరాటాలు నిర్మించారన్నారు.

## ప్రజల అవసరాలకే ప్రాధాన్యం



కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ తదితరులు

**అంబర్‌పేట:** నియోజకవర్గ ప్రజల అవసరాలు తీర్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్‌లో రూ.70 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను స్థానిక కార్పొరేటర్ బి.పద్మవెంకట్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..... సామాజిక భవనాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో అర్హులైన అందరికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చందు, రమేష్ నాయక్, మిర్యాల రవీందర్, బాల్‌రాజు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇష్టంతో చదివితే సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధ్యం



కార్యక్రమంలో పాల్గొన్న ర్యాంకర్ పవన్‌దత్త

**చిక్కడపల్లి:** ఇష్టంతో కష్టపడి చదివితే సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధించడం సులభమవుతుందని ఆలిండియా సివిల్స్ ర్యాంకర్ పవన్‌దత్త సివిల్స్ అభ్యర్థులకు సూచించారు. అశోక్‌నగర్‌లోని శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సదస్సును నిర్వహించారు. యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ 2022 పరీక్షలో ఆల్ ఇండియా 22 ర్యాంక్ సాధించిన పవన్‌దత్త హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనలాగా మొదటి ప్రయత్నంలోనే ఐఏఎస్ ర్యాంక్ సాధించడం ఎవరికైనా సాధ్యమని తెలిపారు. ప్రిలిమ్స్ మెయిన్స్, ఇంటర్వ్యూ స్టేజ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

## పిల్లల పౌష్టికాహారంపై దృష్టి సారించాలి



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

**కాచిగూడ:** పౌష్టికాహారం విషయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ కవాడపు బాల అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమానికి నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ కవాడపు బాల, అంగన్‌వాడీ టీచర్ శివరాణి ల పర్యవేక్షణలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న ఆరోగ్యలక్ష్మీ పథకాన్ని పిల్లలు, గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా, స్వరూప, అనిత తదితరులు పాల్గొన్నారు.

## మేరు కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి

**కాచిగూడ:** మేరు కులస్తులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మనుగడ సాధ్యమని మేరు సంఘం ప్రతినిధులు ఓదెల శేఖర్, కె.వెంకటేష్ అన్నారు. ఆదివారం రాత్రి కాచిగూడలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మేరు కులస్తులు అభివృద్ధి చెందాలంటే, సమస్యల పరిష్కారానికి కలిసి కట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేరు సంఘం ప్రతినిధులు రవిరాజ్, అభినయ్, అవినాష్ పాల్గొన్నారు.

## బీసీలకు 50శాతం సీట్లు కేటాయించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ర్యాంకర్ పవన్‌దత్త

**కాచిగూడ:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 50శాతం సీట్లు కేటాయించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం లేకపోవడంతో బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని ఆయన ఆదివారం పేర్కొన్నారు. బీసీలకు 50 సీట్లు కేటాయించాలని కోరుతూ తెలంగాణలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు ఆయన లేఖలు రాశారు. బీసీలకు 50 శాతం సీట్లుకేటాయించిన పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందని, బీసీల విస్మరించిన పార్టీలకు బీసీలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బాబా యాదవ్, ప్రవీణ్, భవాని పాల్గొన్నారు.

## క్రికెట్ టీమ్ విజేతలకు బహుమతుల ప్రదానం



జ్ఞాపికలు అందజేస్తున్న ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్‌రెడ్డి

**కవాడిగూడ:** తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర తొలి హోంశాఖ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రత్యేకంగా ముషీరాబాద్ పోలీస్ శాఖ సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ టీమ్‌లు పాల్గొని ముషీరాబాద్, చిక్కడపల్లి పోలీసు జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. సీఎం కేసిఆర్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నాయిని మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గెలుపొందిన పోలీసు జట్లకు షీల్డ్‌లు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పోలీసు శాఖలో మంచి గుర్తింపు వచ్చిందని ప్రజలు మెచ్చుకునే విధంగా సేవా దుర్పదంతో ముందుకు పోతున్నారని పేర్కొన్నారు. అనంతరం చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ముషీరాబాద్ సిఐ సంజయ్‌కుమార్, సిఐ జహంగీర్‌యాదవ్, దోమలగూడ సిఐ శ్రీనివాస్‌రెడ్డిలకు మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## 10న వార్డు కార్యాలయాల ప్రారంభం!

**బన్సీలాల్‌పేట్:** సికింద్రాబాద్‌లో జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాల ప్రారంభం వాయిదా పడింది. గతంలో నిర్ణయించిన విధంగా కాకుండా ఈ నెల 10న వీటిని ప్రారంభించడానికి అధికారులు నిర్ణయించారు. గ్రేటర్‌లో జీహెచ్‌ఎంసీ పాలన వికేంద్రీకరణ లక్ష్యంగా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయాల ని అధికారులు నిర్ణయించారు. తొలుత ఈ నెల 2న వార్డు కార్యాలయాలను ప్రారంభించాలని నిర్ణయించగా పూర్తిస్థాయిలో వీటి ఏర్పాటు కానందున ఈ నెల 10న ప్రారంభించాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. చాలా ప్రాంతాల్లో ఎంపిక చేసిన భవనాలు ఇరుకుగా ఉన్నాయని అదే విధంగా ఆయా బస్తీ ప్రజలు వార్డు కార్యాలయాల ఏర్పాటుకు కమ్యూనిటీహాళ్లను ఇవ్వడానికి వ్యతిరేకిస్తున్నారు. దీంతో వార్డు కార్యాలయాల ప్రారంభంలో కొంత జాప్యం చోటు చేసుకుంది. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఈ నెల 10న ప్రభుత్వం సుపరిపాలన దినోత్సవం నిర్వహిస్తున్నారు. అయితే అదే రోజు వార్డు కార్యాలయాలను కూడా ప్రారంభించాలని మున్సిపల్ ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీహాల్‌లో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించగా స్థానిక బస్తీ కమిటీ వ్యతిరేకించింది. తాము బస్తీలో వివాహాది ఇతరత్రా శుభకార్యాలు, కార్యక్రమాలు జరుపుకోవడానికి ఇబ్బంది అవుతుందనే కారణంగా ఇక్కడ వార్డు కార్యాలయం వద్దని బస్తీ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే బస్తీ కమిటీ ప్రతినిధులు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి తమ వాదనను విన్పించారు. దీంతో ఇక్కడ వార్డు కార్యాలయం ఏర్పాటు విషయం కొంత సందిగ్ధతలో పడిందని తెలిసింది.

## విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ చెన్నప్ప

**కాచిగూడ:** విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఉస్మానియా యూనివర్సిటీ వాణిజ్య విభాగం అధిపతి ప్రొఫెసర్ డి. చెన్నప్ప అన్నారు. ఆదివారం జాగృతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల డిగ్రీ మూడవ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ చెన్నప్ప ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో జాగృతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఓ.శ్రీనివాస్ రెడ్డి, కళాశాల జాయింట్ సెక్రటరీ శశికిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

**అడ్డగుట్ట:** సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. మే 1వ తేదీ నుంచి ఈ నెల 4 వరకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో క్రికెట్, చెస్, ఫుట్‌బాల్, యోగా, జిమ్నాస్టిక్స్, హాకీ, కబడ్డీతో పాటు వివిధ క్రీడల్లో శిక్షణ అందించారు. ఆదివారం ముగింపు వేడుకలు నిర్వహించి వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

## అవగాహన సదస్సులను జయప్రదం చేయాలి

**అడ్డగుట్ట:** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించనున్న అవగాహన సదస్సును జయప్రదం చేయాలని జీఎల్‌టీ కోఆర్డినేటర్ సంపత్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సికింద్రాబాద్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజన్ అండ్ జోన్ కమిటీ సమావేశం సాదు శ్యామ్ ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎల్‌టీ సంపత్ గౌడ్ మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ప్రజలకు మరిన్ని సేవలందించే విధంగా అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ నెల 11న నాగోల్‌లో నిర్వహించనున్న అవగాహన సదస్సులో అన్ని లయన్స్ క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఆగస్టు 20న డిస్ట్రిక్ట్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమంలో భాగంగా సాకేత్‌లోని వోర్ల కన్వెన్షన్‌లో హరిష్‌రెడ్డి డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్లు బి. శ్యామ్‌రావు, మల్లికార్జున్, కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

## మహాసభలను విజయవంతం చేయాలి

**లిబర్టీ:** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 6, 7వ తేదీల్లో నిర్వహించనున్నట్లు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న మహాసభల్లో భాగంగా తొలి రోజు వేలాది మందితో ప్రదర్శన, భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. 7వ తేదీన ప్రతినిధుల మహాసభ ఉంటుందని పేర్కొన్నారు. లిబర్టీ వద్ద ఉన్న మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహాసభలు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 800 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. మేడ్చల్ పట్టణంలోని జంగం లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు మహాసభలు జరుగుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు కనీస వేతనం, కార్మికుల పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్ని మున్సిపాలిటీల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని తదితర పది డిమాండ్లపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యచరణ రూపొందిస్తామన్నారు.

## పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యా సంస్థలు అందుబాటులో ఉండాలి

**సికింద్రాబాద్:** ప్రైవేటు విద్యా సంస్థలు అన్ని వర్గాల విద్యార్థులకు అందుబాటులో ఉండి బోధనలు అందించాలని ముషీరాబాద్ మండల విద్యాశాఖ అధికారి ఎస్.చిరంజీవి కోరారు. పేద మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో వెలిసిన ప్రైవేటు పాఠశాలలు ఆయా తరగతులకు చెందిన విద్యార్థులను సామాజిక దృక్పథంతో చూడాలన్నారు. పది ఫలితాల్లో మండలంలోనే ఉత్తమ ఫలితాలు సాధించిన సీతాఫల్‌మండి శ్రీసాయి విద్యాలయ విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన మెరిట్ అవార్డు ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. 10/10 టాపర్స్‌గా నిలిచిన ఎన్.జ్యోష్న, వి.తేజస్విని, పి.వీరమల్లిక, ఎం.మనస్వితలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ప్రత్యేక నగదు అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కేఎస్.వెంకటేశ్, డైరెక్టర్ సుధా మాధవి, టి.శ్రీనివాస్‌రాజు, ప్రధానోపాధ్యాయుడు వి.కృష్ణమూర్తి హాజరయ్యారు.